# పాలపొంగు

— పాలగుమ్మి పద్మరాజు.



'ఏమే శకుంతలా! అలా పాలు పొంగి పోతుంటే కళ్ళప్పగించి చూస్తూ కూర్చున్నావా?'

'నేను చూడలేదక్కయ్యా?'

'ఎందుకు చూస్తావు? రాణీగారివి మరి'

శకుంతల తనలో తను నవ్వుకుని వీధి గదిలోకి వచ్చేసింది. రత్తమ్మ గొంతు నేపథ్యంలో అసందర్భమయిన శ్రుతిలో సంగీతంలా మోగుతూనే వుంది.

'ఈ ఆడ పీనుగలకి చదువులొచ్చాకే కాలం యిలా తగులబడింది. మడత నలగకుండా చీరలు సింగారించి వీధమ్మట టక్కూ టిక్కూ నడిస్తే సరిగావును'

శకుంతల చెవుల్లో ఈ సంగీతం మోగుతూనే వుంది. ఆమె కళ్ళుతెరిచిన పుస్తకంవేపు చూస్తూనే వున్నాయి. అచ్చు పంక్తుల మధ్య అతి తెల్లని కాగితం ఆమె ఆలోచనల్లోకి పాకిపోయింది. పొంగిన పాలలా లోపలంతా ఆవరించింది.

ఆ పుస్తకం మూసేసింది. ఆ తెల్లని ఆందోళన భరించలేక కళ్ళుమూసుకుంది. మూసిన కళ్ళతో, సగంతెరిచిన నోటితో, ఆ పెదవుల నడుమ మెరిసే బియ్యపు గింజల్లాంటి పళ్ళతో నిశ్శబ్దంగా నవ్వింది. ఒక క్షణం ఆ చిరునవ్వు సమాధిలో ఉండి చటుక్కుని లేచింది, ఒళ్ళు విరుచుకుంది. పుస్తకాలు చేత పుచ్చుకుని బయటికి వచ్చింది.

'ఏమమ్మా! కాలేజీకి వెళుతున్నావా?' అన్నాడు రామన్న.

'అవును బావా!' అంది శకుంతల.

'ఇప్పణ్నించి ఎందుకే, ఇంకా తొమ్మిది కొట్టలేదు' అంది రత్తమ్మ. శకుంతల సమాధానం చెప్పకుండా వెళ్ళిపోయింది.

'నా మాటంటే బొత్తిగా గడ్డి పరక్కింద కట్టి పారేస్తుంది'

'ఎందుకే మాట ముందు దానిమీద అల్లా విరుచుకుపడతావు?'

'ఇదుగో, దాన్నింకెప్పుడూ వెనకేసుకు రాకండి, ఏం? ఇంట్లో పెట్టుకుని ఇన్ని విధాల చూస్తుంటే దానికంత పొగరేం?'

'ఒసే! నీకు స్వయానా చెల్లెలు. పాపం! చిన్నతనంలోనే దేవుడన్యాయం చేశాడు...'

'అన్యాయం చెయ్యడమేం? అందలమెక్కించాడు. దాని మొగుడు అర్థాంతరపు చావు చచ్చాడు గనుకే దానికి కాలేజీ చదువులూ, ఈ భోగం పట్టింది. లేకపోతే నాలాగే చినిగిన చీరలు కట్టుకుని వంటింటిలోనే దేవులాడుతూ ఉండేది...'

'ఓసి వెర్రిపీనుగా! ఎవరన్నా వింటే నవ్విపోతారు. సొంత చెల్లెలికీ అవస్థ వచ్చిందని జాలిపడ్డానికి బదులు—'

'అయ్యో! మీరంతా జాలిపడుతుంటే చాలదూ. ఈ దేశంలో వెధవ ముండలమీదే అందరికీ జాలి, నాయకులూ, వినాయకులూ వాళ్ళని గురించే ఉపన్యాసాలిస్తారు. గవర్నమెంటు వాళ్ళువాళ్ళకి ఊరికే చదువులు చెపుతారు. మొగుడు చాటు ముండలగతి చూసేవాళ్ళెవరూ లేరు...'

శ్రుతిమించి యీ ధోరణి యింకో రాగాన పడడం పరిపాటి. ఆమె గొంతుకలోనూ, కళ్ళలోనూ, ముక్కులోనూ సూచనలు కనపడగానే రామన్న యింట్లోంచి వెళ్ళిపోతాడు.

* * *

శకుంతల కాలేజీ నుంచి యింటికి వచ్చేటప్పుడు ఒక అణా పీచు మిఠాయి కొని తెస్తుంది. ఆ పీచు మిఠాయి నరసన్న, డుంబు, పాపీ తింటారు. దొడ్డిగుమ్మం మెట్లమీద కూర్చుని, శకుంతల వారి పక్కనే కూచుని వాళ్ళకి పాటలూ, కథలూ చెపుతుంది.

డుంబుకెప్పుడూ అసందర్భమయిన అనుమానాలొస్తుంటాయి. ఒకనాడు అడిగాడు.

'అమ్మ అస్తమానం బయటుంటుంది. నువ్వుండవేం పిన్నీ?'

శకుంతల విరగబడి నవ్వింది. ఎదురుగా దొడ్లో జామిచెట్టుకింద రత్తమ్మ చాప చుట్టా, చెంబూ దగ్గిర పెట్టుకుని కూచుంది.

'ఏమిటా వెకిలినవ్వు? సిగ్గులేదూ?' అంది.

శకుంతల మెట్లమీద వెనక్కి జేరగిలబడి శరీరం అంతటితోనూ నవ్వింది. అలా నవ్వితే డుంబుకి ఆనందం. రత్తమ్మ జామి బెత్తం పట్టుకొచ్చింది డుంబుని కొట్టడానికి. కాని ఆమె కూడా పొంగివస్తున్న నవ్వుని కోపంగా మార్చలేకపోయింది.

'వెధవముని ప్రశ్నలూ మువ్వూను' అని మందలించింది. ఆ తరువాత పిల్లలు లేనప్పుడు శకుంతలతో అంది. 'తల్లీ! ఇల్లంతా అంటుమంగలం చెయ్యకపోతే ఆ మూణ్నాళ్ళయినా వేరే కూచోకూడదూ?'

శకుంతల దానికేమీ సమాధానం చెప్పలేదు.

మరో రోజున డుంబు కుంకుంబరిణ, అద్దం పట్టుకుని శకుంతల చదువుకునే గదిలోకి వెళ్ళాడు. ఆమె అతనివేపు బొమలు ముడివేసి చూసింది. డుంబు అద్దం ఆమె చేతికిచ్చాడు.

'పిన్నీ! పెద్ద బొట్టుపెట్టుకుంటే నువ్వెంత బాగుంటావో తెలుసా?'

'నాకొద్దు'

'పెట్టుకో పిన్నీ, ఒక్కసారి పెట్టుకో'

'సరే నువ్వే పెట్టు'

డుంబు చక్కగా గుండ్రంగా కుంకుడు కాయంత బొట్టు దిద్దాడు.

'ఏమిట్రా అది!అయ్యో! అయ్యో! కుర్ర వెధవకి లేకపోతే నీకయినా బుద్ధి లేదుటే?' అంది రత్తమ్మ లోపలికొస్తూ.

'ఫరవాలేదక్కయ్యా! వాడు సరదా పడ్డాడు'

'అయ్యో, సరదాపడకేం? వాడికీ సరదాయే, నీకూ సరదాయే. నడు వెధవా! తిండి తిని తగులడు. వేళయింది' అంది రత్తమ్మ.

అదే శకుంతలకి కూడా భోజనానికి ఆహ్వానం.

అన్నం తింటున్నంతసేపూ శకుంతల నొసటిమీద ఆ బొట్టు అలాగే వుంది. శకుంతలకు ఆ బొట్టున్న సంగతి అసలు గుర్తుందో లేదో కాని రత్తమ్మ ఆ బొట్టు ఉండడం మూలాన్ని గావును ఆ పూట నోరు విప్పలేదు. ముఖం ముడుచుకుని ధుమధుమలాడుతున్నా, కళ్ళల్లో ఏదో సంకోచం. గొంతుకలో ఏదో ఆందోళన ఆమె ధోరణిని అరికట్టాయి.


బడికి పోయేటప్పుడు డుంబు తల్లిని అడిగాడు.

'అమ్మా! పిన్ని బొట్టు పెట్టుకుంటే ఏం?'

'అది నోచుకోలేదు నాయనా!' అంది రత్తమ్మ. అందులో జాలి కాని జాలి ధ్వనించింది. కాని డుంబుకి అది అర్థం కానిది. డుంబు అది మాత్రం గుర్తించాడు.

* * *








శకుంతల నవ్వుతూ చలాకీగా వున్నప్పుడు రత్తమ్మ రక్తం, ఏదో తెలియని ఆవేదనతో వేడెక్కిపోతుంది. రత్తమ్మ ఎన్ని తిట్టినా శకుంతల పట్టించుకోదు. అప్పుడు రత్తమ్మ కోపం మొగుడుమీదా, పిల్లలమీదా ఉవ్వెత్తుగా తిరుగుతుంది.

'అది కులాసాగా వుంటే నిన్నేం చేసింది?' అంటాడు రామన్న.

'అవును మరి. ఐదోతనమున్నా, నా మొహాన్నే కులాసాగా ఉండాలని రాయలేదు. ఏం చెయ్యను' అంటుంది రత్తమ్మ.

కాని, ఆరోజు శకుంతల కళ్ళు ఎదురుగా వున్న వస్తువుల్ని గుర్తుపట్టలేదు. ఎక్కడో చూస్తున్నాయి. రత్తమ్మ వచ్చి భోజనానికి లెమ్మంది. శకుంతల లేచి కొంచెం తటపటాయించింది.

'నాకివేళ ఆకలిగా లేదు' అని మళ్ళీ కూర్చుంది.

'ఒంట్లో బాగా లేకపోతే కాలేజీ మానెయ్యరాదూ?' అంది రత్తమ్మ.

కాని, శకుంతల కాలేజీకి వెళ్ళింది. తిరిగి వచ్చేటప్పుడు పీచుమిఠాయి కొనుక్కురావడం మరచిపోయింది. పిల్లలు చుట్టూ చేరి అడిగినప్పుడు నీరసంగా నవ్వి 'మరిచిపోయాను' అంది.

రత్తమ్మకు, శకుంతలను సముదాయించడం తెలియదు. శకుంతలలో ఏదోమార్పు వచ్చిందని ఆమెకు తెలుసు. కాని ఆమెను గుచ్చి గుచ్చి అడిగేటంత చనువు లేదు. శకుంతల మనసులో ఎన్నో లోతులున్నాయనీ, ఆ లోతుల్ని తరిచి నిజాన్ని గ్రహించడం అసాధ్యమనీ ఆమెకు తెలుసు. ఒక ప్రక్క ఒక తల్లి కడుపున పుట్టినా తను పరాయిదయినట్టు శకుంతల సంచరిస్తూందన్న అసహనం, రెండో ప్రక్క శకుంతలంటే ఒక అవ్యక్తమైన భయం ఆమెను చెల్లెలికి దూరం చేశాయి.

శకుంతల వెల్లకిల పడుకుని ఇంటి కప్పవేపు చూస్తూంటే రత్తమ్మ వచ్చి ఆమె నుదుటి మీద చెయ్యి వేసింది. కొంచెం చిరుచెమట తప్ప మరేమీ తేడా ఆమెకు కనిపించలేదు.

'తెల్లారగట్టేపోయి ఆ ఏటిలో మునిగి రాకపోతే ఏం? జలుబు చేసినట్టుంది. నేను చెపితే వింటావా?' అంది.

శకుంతలేమీ సమాధానం చెప్పలేదు.

ఆమె రోజూ చీకటితోటే లేచి, ఏటిలో స్నానం చేసి, తడిబట్టతో, బిందెడు నీళ్ళు తేవడం అలవాటు. ఎన్నోసార్లు రత్తమ్మ వద్దని చెప్పింది. కాని, శకుంతల లక్ష్యపెట్టలేదు. తనకంత ఆచారం లేదని శకుంతలకు తెలుసు. అయినా యీ తడిబట్టలతో నీళ్ళు తేవడం ఎందుకో రత్తమ్మకు అర్థం కాలేదు.

'తడిబట్టలు వంటికంటుకుని రెపరెపలాడుతుంటే నాకు బాగుంటుంది' అనేది శకుంతల.

ఈ సమాధానం రత్తమ్మకి మరీ చిత్రంగా అగుపించేది

* * *

ఆనాడు యథాప్రకారం రత్తమ్మ లేచి వీధి పాచి చేసుకుంటుండగా పక్కింటి సుందరమ్మ తడిగుడ్డలతో పరిగెత్తుకుంటూ వచ్చింది.

'రత్తమ్మా! కొంప మునిగిపోయింది. మీ శకుంతల... తొందరగా రా'

చీపురూ, ముగ్గు గొట్టం అక్కడే పారేసి పరిగెత్తింది రత్తమ్మ.

నది ఒడ్డున జనం మూగి వున్నారు. రత్తమ్మ జనాన్ని తోసుకుని లోపలికి వెళ్ళింది. శకుంతల తడి తలనించి నీళ్ళు కారుతున్నాయి. చెల్లెల శరీరం మీద పడి ఏడిచింది రత్తమ్మ.

'ఈ రేవు ఎప్పుడూ ప్రమాదమే నండీ ఇది ఆరో చావు' అన్నాడొకాయన.

'దొంగ ఊబమ్మా! రత్నంలాంటి బిడ్డ కొంచెం దిగువుకి అడుగేసినట్టుంది' అంది మరొక ఆవిడ.

కాని రత్తమ్మకి ఆమె స్త్రీ హృదయంలో ఎక్కడో అసలు నిజం తెలుసు. రేవుగాని, ఏరుగాని యీ పాపంలో పాలు పంచుకోలేదు. శకుంతల కావాలనే తన ప్రాణాలు నదికి అర్పించింది.

'ఇలా జరుగుతుందని ఎవ్వరూ అనుకోలేదు తల్లీ!' అంటూ ఏడిచింది రత్తమ్మ.

కాని యిలా జరుగుతుందని నీకు తెలుసునని ఆమె ఆత్మ ఘోషించింది. ఆ క్షణంలో శకుంతల నిజంగా ఆమె చెల్లెలయిపోయింది.